సాక్షి చిత్తూరు

శనివారం । 1 । ఏప్రిల్ । 2023



రాహుకాల పూజలు

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి రాహుకాల అభిషేక పూజలను ఘనంగా నిర్వహించారు.



శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శ్రీవారి దర్శనానికి సుమారు 18 గంటల సమయం పడుతోంది.



పెద్దకొటాయి ఉత్సవం

శ్రీకాళహస్తి: ముక్కంటి ఆలయంలో శుక్రవారం పెద్దకొట్టాయి ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో ఉత్సవర్లకు పూజలు చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శనివారం(సా)	సహర్ ఆదివారం(ఉ)
తిరుపతి	6.27	4.49
చిత్తూరు	6.30	4.49
పుంగనూరు	6.31	4.52

న్యూస్‌రీల్

ముగ్గురికి కోవిడ్ నిర్ధారణ

తిరుపతి తుడా: రామకుప్పం మండలంలోని చెందిన ఒకే కుటుంబంలోని ముగ్గురికి కోవిడ్ సోకినట్లు తిరుపతి రుయా వైద్యులు శుక్రవారం నిర్ధారించారు. రామకుప్పానికి చెందిన ఓ యువకుడికి బుధవారం కోవిడ్ లక్షణాలు ఉండడంతో స్థానిక పీహెచ్‌సీలో ర్యాపిడ్ పరీక్ష నిర్వహించారు. పాజిటివ్ వచ్చింది. మరుసటి రోజు అతని తల్లి, అత్తకు కూడా లక్షణాలు ఉండడంతో ర్యాపిడ్ టెస్ట్ చేశారు. వారికి కూడా పాజిటివ్ వచ్చింది. అయితే ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించిన తర్వాత వచ్చే ఫలితాలను బట్టి కచ్చితంగా నిర్ధారిస్తారు. ఈ క్రమంలో ఆ ముగ్గురి శాంపిల్స్‌ను తీసి వైద్యులు తిరుపతిలోని స్విమ్స్‌కు పంపారు. సిమ్స్‌లో ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించారు. ఆమేరకు 24 సంవత్సరాల యువకుడితో పాటు అతని తల్లి, అత్తకు కూడా కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యిందని శుక్రవారం రుయా వైద్యులు తెలిపారు. ఆ ముగ్గురిని రుయాలోని ఐడీహెచ్ వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు.

డైట్ ఎఫ్ఏసీ ప్రిన్సిపల్‌గా ప్రభాకర్



చిత్తూరు కలెక్టరేట్ : కార్వేటినగరంలోని జిల్లా విద్యాశిక్షణసంస్థ (డైట్) ఎఫ్ఏసీ ప్రిన్సిపల్‌గా ప్రభాకర్ నియమితులయ్యారు. శుక్రవారం ఈ మేరకు డీఈఓ కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. ప్రభాకర్ గతంలో పుత్తూరు మండలం పరమేశ్వరమంగళం ఉన్నత పాఠశాలలో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసేవారు. ఎఫ్ఎస్‌టీసీ నిబంధనలతో ప్రస్తుతం డైట్‌లో లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

వివరాల సేకరణ

చిత్తూరు కార్పొరేషన్: ఓ కేసు విషయంలో వివరాల కోసం చిత్తూరు అర్బన్ రిజిస్ట్రార్ కార్యాలయానికి శుక్రవారం ఏసీబీ అధికారులు వచ్చారు. సుమారు గంటపాటు సమాచారం సేకరించి తీసుకెళ్లారు.

జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ జయంతి నిర్వహణపై సమీక్ష

చిత్తూరు కలెక్టరేట్ : బాబూ జగ్జీవన్‌రామ్, బీఆర్ అంబేడ్కర్ జయంతి నిర్వహణపై జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సభ్యులు, ఎస్సీ, ఎస్టీ సంఘాలతో డీఆర్‌ఓ రాజశేఖర్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 5న జగ్జీవన్‌రాం, 14వ తేదీన అంబేడ్కర్ జయంతి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఘనంగా కార్యక్రమాలను జరిపించేందుకు సలహాలు అందించాలని కోరారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి, ఎస్సీ,ఎస్టీ సంఘాల నాయకులు టి. గోవిందన్, సి.ఎల్లప్ప, కె.రవి, బి.పార్థసారథి, ఎస్.మునిస్వామి, కె.ధనంజయరావ్, వి.దామోదరం, బి.రాజ్ కుమార్, ఎం.డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా తల్లిదండ్రుల పోషణ



మాట్లాడుతున్న న్యాయమూర్తి కరుణకుమార్

చిత్తూరు కలెక్టరేట్ : వృద్ధులైన తల్లిదండ్రులను వారి పిల్లలు బాధ్యతగా పోషించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఐ. కరుణ్ కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక తపోవనంలోని ఓల్డ్ ఏజ్ హోమ్‌లో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెద్దలను కంటికి రెప్పలా చూసుకోవడం బాధ్యతగా భావించాలని కోరారు. వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు వై. శ్రీనివాస్ మాట్లాడుతూ వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007 ప్రకారం తల్లిదండ్రుల సంరక్షణ చూడవలసిన బాధ్యత పిల్లలపై ఉందని తెలిపారు.

భూసేకరణ వేగవంతం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో భూసేకరణను వేగవంతం చేయాలని జేసీ వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ బెంగళూరు-చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి పకడ్బందీగా భూములు సేకరించాలన్నారు. అలాగే పరిహారం చెల్లింపునకు సంబంధిత వివరాలను సిద్ధం చేయాలని సూచించారు. సమీక్షలో ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.

రీ సర్వేతో భూరక్ష

పచ్చటి పల్లెల్లో కక్షలు కార్పణ్యాలు రగులుకోకూడదు.. అన్నదమ్ముల నడుమ భూతగాదాలు చిచ్చుపెట్టకూడదు.. కుటుంబాల మధ్య పొలం సరిహద్దు వివాదాలు తలెత్తకూడదు.. గ్రామాల్లో ప్రశాంతవాతావరణం నెలకొల్పాలి.. ఘర్షణలకు తావులేని పల్లెసీమలుగా తీర్చిదిద్దాలి.. ఇదే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్షణ పథకం ప్రవేశపెట్టారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పారదర్శకంగా భూములను రీసర్వే చేయిస్తున్నారు. సరికొత్త సర్వేపై రైతులు బహుళ ప్రయోజనాలు పొందుతున్నారు. భూహక్కులను కచ్చితమైన కొలతలతో పదిలపరుచుకుంటున్నారు.

- పారదర్శకంగా డ్రోన్ సర్వే
- పకడ్బందీగా సర్వేరాళ్లు నాటే ప్రక్రియ
- నిరంతరం పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు
- ప్రయోగాత్మకంగా రెండు సచివాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్లు
- హక్కు పత్రాల్లో మ్యాప్‌తో సహా సమస్త వివరాలు





సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్, జేసీ వెంకటేశ్వర్ (ఫైల్) భూముల రీ సర్వేలో సిబ్బంది

సాక్షి, చిత్తూరు : జిల్లాలో ముమ్మరంగా భూముల రీసర్వే చేస్తున్నారు. డ్రోన్ సర్వేను దాదాపు పూర్తి చేసేశారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో రైతుల సమక్షంలోనే రెవెన్యూ సిబ్బంది భూములకు హద్దులు నిర్ణయిస్తున్నారు. భూవిస్తీర్ణాన్ని పక్కాగా నిర్ధారిస్తున్నారు. పొరపాట్లు దొర్లితే నిర్ణీత సమయంలోనే పరిష్కరిస్తున్నారు. గ్రామసభలు ఏర్పాటు చేసి సర్వేపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలిస్తున్నారు. అనంతరం భూముల వివరాలను కంప్యూటరైజ్ చేస్తున్నారు.

పక్కాగా హద్దు రాళ్లు

జిల్లాలో సర్వే చేసిన భూములకు సంబంధించి మొత్తం 1.01లక్షల సర్వేరాళ్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. అందులో ఇప్పటివరకు సర్వే పూర్తయిన గ్రామాలకు 33వేల రాళ్లు కావాల్సి ఉంటాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఇప్పటికే ఆయా ప్రాంతాలకు 26,532 రాళ్లను తరలించారు. వీటిలో 7,393 సర్వేరాళ్లను పకడ్బందీగా నాటించారు. అలాగే ప్రయోగాత్మకంగా జీడీ నెల్లూరు మండలంలోని అగరమంగళం, గుడిపాల మండలంలోని ముట్టుకూరుపల్లె సచివాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను చేపట్టారు.

సమగ్రంగా వివరాలు

జగనన్న సంపూర్ణ భూ హక్కు పత్రాల్లో క్యూ ఆర్ కోడ్, మ్యాప్‌లు, విస్తీర్ణం, సర్వే నంబర్లతో సహా సమగ్రంగా వివరాలను ముద్రించారు. రైతు కేవలం క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే చాలు భూములకు సంబంధించిన అన్ని వివరాలు తెలుసుకునే వెసులుబాటు కల్పించారు. సర్వే అనంతరం విడతల వారీగా రైతులకు హక్కు పత్రాలను అందజేయనున్నారు.

మ్యూటేషన్‌కు అవకాశం

అత్యధిక గ్రామాల్లో ఒకేసారి హద్దుల గుర్తింపు, విస్తీర్ణం, రీసర్వే చేపట్టడంతో ఎక్కడైనా చిన్న తప్పులు దొర్లే ప్రమాదముందని ప్రభుత్వం ముందుగానే అంచనా వేసింది. ఈ మేరకు ఎమైనా తప్పులు జరిగితే మ్యూటేషన్ ద్వారా సరిదిద్దుకునే అవకాశం కల్పించింది. భూ సర్వే ప్రక్రియలో ఎప్పుడు అభ్యంతరాలు వ్యక్తమైనా వాటిని పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టింది. దీంతో ఆక్రమణలు, కబ్జాలు, రికార్డుల్లో అవకతవకలు తదితరాలకు పూర్తిస్థాయిలో చెక్ పెడుతోంది.

పకడ్బందీగా పర్యవేక్షణ

చిన్నపాటి దోషం కూడా లేకుండా రైతులకు భూ హక్కు పత్రం అందించాలని ప్రభుత్వం స్పష్టంగా ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో భూ సర్వే ప్రక్రియను కలెక్టర్, జేసీ, ఆర్డీఓలు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సర్వే పూర్తయిన తర్వాత హక్కు పత్రాలను సైతం తనిఖీ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్నారు. దీంతో సిబ్బంది సైతం నిత్యం అప్రమత్తంగా ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తున్నారు.

జిల్లా సమాచారం

మొత్తం మండలాలు	31
రెవెన్యూ డివిజన్లు	04
గ్రామాలు	823
డ్రోన్ సర్వే పూర్తయినవి	766
మొత్తం విస్తీర్ణం	12.99 లక్షల ఎకరాలు
సర్వే చేసినవి	11.7లక్షల ఎకరాలు
రిజిస్ట్రేషన్ పూర్తయినవి	98 వేల ఎకరాలు
అందించిన భూహక్కు పత్రాలు	28 వేలు

డ్రోన్ సర్వే



పారదరద్శకంగా ప్రక్రియ



"భూముల రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేస్తున్నాం. పకడ్బందీగా భూ యజమానులకు హక్కు పత్రాలు అందిస్తున్నాం. అందులో ఏమైనా తప్పులు ఉంటే వెంటనే డీటీ, తహసీల్దార్, ఆర్డీఓను సంప్రదించాలని సూచించాం. హక్కు పత్రాలు పొందిన రైతులకు ఆయా గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేయించుకునే వెసులుబాటు కల్పించాం. జిల్లాలో త్వరితగతిన రీ సర్వే పూర్తి చేసేందుకు పక్కాగా చర్యలు చేపట్టాం.

– హరినారాయణన్, కలెక్టర్, చిత్తూరు

సమస్యలు లేకుండా పూర్తి



మా గ్రామంలో ఎలాంట సమస్యలు లేకుండా రీ సర్వే పనులు పూర్తి చేశారు. భూ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. క్షేత్రస్థాయిలో సర్వే రాళ్లు సైతం దాదాపుగా నాటారు. ఏ, బీ, సీ క్లాసుల ప్రకారం రాళ్లు నాటించారు. భవిష్యత్‌లో కూడా భూ సమస్యలు తలెత్తకుండా ఆధునిక పరికరాలను వినియోగించి సర్వే చేయించడం ఆనందంగా ఉంది. – **రమేష్, సర్పంచ్, సంక్రాంతిపల్లె, బంగారు పాళ్యం మండలం**

రాళ్లు నాటాం.. పత్రాలు ఇచ్చాం



మా గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద రీ సర్వే చేపట్టారు. ఎలాంటి వివాదాలు లేకుండా సర్వే హద్దు రాళ్లు నాటించాం. రైతులకు భూహక్కు పత్రాల పంపిణీ పూర్తి చేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాం. పారదర్శకంగా సర్వే పూర్తవడంతో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

– **సునయన, పంచాయతీ కార్యదర్శి, అగరమంగళం, జీడీ నెల్లూరు మండలం**

సచివాలయంలోనే రిజిస్ట్రేషన్



మా గ్రామంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా భూముల రీసర్వే పూర్తి చేశారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికవడంతో రిజిస్ట్రేషన్ సైతం ఇక్కడి సచివాలయంలోనే జరిగింది. రూపాయి ఖర్చు లేదు. వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి జగనన్నకు కృతజ్ఞతలు.

– **కిరణ్ బాబు, రైతు, అగర మంగళం, జీడీ నెల్లూరు మండలం**

పైసా ఖర్చులేదు



మా గ్రామంలో రీ సర్వే పూర్తయింది. భూ హక్కు పత్రాల కూడా అందించారు. గ్రామసభ నిర్వహించి పత్రాల్లో ఏమైనా పొరపాట్లుంటే చూసుకోమని చెప్పారు. మాకు పైసా ఖర్చు లేకుండా అన్ని పనులు చేస్తున్నారు. – **చంద్రమ్మ, రైతు, ఎస్ఆర్‌పురం, పలమనేరు మండలం**

పరిశోధించు.. ఆవిష్కరించు!



గతంకంటే భిన్నంగా తిరుత్సవ్ వేడుకలు నిర్వహిస్తున్నాం. విజ్ఞానం, సాంకేతికత మేళవించిన పలు టెక్నో ఈవెంట్లు కూడా నిర్వహిస్తున్నాం. ఐఐటీ విద్యార్థులే కాకుండా దేశంలోని ప్రముఖ ఇంజినీరింగ్ కాలేజీల నుంచి విద్యార్థులను ఆహ్వానించాం. అందరికీ విజ్ఞానం పంచాలనే సదుద్దేశంతో నూతన ఆవిష్కరణలకు ఆస్కారం కల్పించాం. ఈవెంట్లు, ప్రోషోలకు భారీ ప్రైజ్‌మనీ అందిస్తున్నాం' అని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎస్ సత్యనారాయణ తెలిపారు. తిరుత్సవ్-2023లో భాగంగా మొదటి రోజు శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన విద్యార్థులు ఆటపాటలు, ఈవెంట్లతో అదరగొట్టారు.

- అట్టహాసంగా తిరుత్సవ్-2023 వేడుకలు
- మూడు వేల మంది విద్యార్థులు హాజరు
- అఫీషియల్ లోగో కృష్ణజింక
- టెక్నో ఫెస్ట్ వేడుకల్లో ఐఐటీ డైరెక్టర్ వెల్లడి



తిరుత్సవ లోగోలో కృష్ణజింక చిత్రం

రేణిగుంట, ఏర్పేడు: ప్రపంచ దేశాల్లో భారతావనిని అగ్రగామిగా నిలపడంలో శాస్త్ర,సాంకేతిక రంగాలదే ప్రధాన భూమిక అని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎస్ సత్యనారాయణ తెలిపారు. ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో శుక్రవారం తిరుత్సవ్-2023 టెక్నో ఫెస్ట్ వేడుల ప్రారంభ సభ జరిగింది. ఈ ఏడాది తిరుత్సవ్ అఫీషియల్ లోగోగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జంతువు కృష్ణజింక చిత్రంతో కూడిన ఫొటోలను ఐఐటీ క్యాంపస్‌లో ప్రదర్శించారు. వినోదంతోపాటు విజ్ఞానాన్ని అందించే లక్ష్యంతో 2018 నుంచి తిరుత్సవ్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే కరోనా పరిస్థితుల వల్ల రెండేళ్లు ఆన్‌లైన్‌లో ఉత్సవానికి సంబంధించిన కార్యక్రమాలు జరిగాయని, వివిధ కళాశాలలకు సంబంధించిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో జరిగిన ఈవెంట్లలో పాల్గొన్నట్లు గుర్తుచేశారు.


ఈ ఏడాది భారీ ఏర్పాట్లు

ఈ ఏడాది తిరుత్సవ్ సంబరాలు అంబరాన్నంటేలా ఏర్పాట్లు చేసినట్టు వెల్లడించారు. విజ్ఞానం, సాంకేతికత మేళవించిన పలు టెక్నో ఈవెంట్లు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 3 వేల మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అమరరాజ బ్యాటరీస్ న్యూ ఎనర్జీ స్టోరేజ్ ల్యాబ్ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ ఎం.జగదీష్ మాట్లాడుతూ వ్యాపార రంగంలో విజయవంతమైన ఉత్పత్తులు పొందేందుకు ఆవిష్కరణలతోపాటు సృజనాత్మకత అవసరమన్నారు. కింద్రల్ ప్రిన్సిపల్ డేటా సైంటిస్ట్ డాక్టర్ షీలా మాట్లాడుతూ విభిన్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణల కోసం ప్రతి విద్యార్థి శోధించాలన్నారు. రాత్రి సర్గం బ్యాండ్ పెర్ఫామెన్స్, గ్రూప్ డ్యాన్స్ ఈవెంట్లు ఉత్సాహంగా సాగాయి. డీన్ స్టూడెంట్స్ ఎఫైర్స్, ఫెస్ట్ హెడ్ షామిల్ పాల్గొన్నారు.



వేడుకలను ప్రారంభిస్తున్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

వెన్నుపోటుకు కేరాఫ్ చంద్రబాబు



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం : రాజకీయాల్లో వెన్నుపోటుకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని ఆదిఆంధ్రవాడలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పదవి కోసం తండ్రిని జైలులో పెట్టి, తొడబుట్టినవారిని చంపించిన ఔరంగజేబుకు అన్నయ్య లాంటి వారు చంద్రబాబు అని విమర్శించారు. మాలలు, మాదిగల మధ్య చిచ్చు పెట్టి అధికారం చేపట్టిన చంద్రబాబు తర్వాత ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని వ్యాఖ్యానించి అసలు రూపం బయటపెట్టారన్నారు. దళితులను ఓటు బ్యాంకుగా మాత్రమే చూసే బాబుకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఎస్సీల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రతి సామాజికవర్గానికి ప్రత్యేక కార్పొరేషన్ పెట్టి అండగా నిలుస్తున్నారని తెలిపారు. ఆయన మరో 30 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా ఉండాలని దళితులందరూ కోరుకోవాలని పిలుపునిచ్చారు.

అవినీతి ఆరోపణలపై విచారణ

గంగాధరనెల్లూరు : ఎంపీడీఓ శ్రీదేవి, జూనియర్ అసిస్టెంట్ బాలాజీపై అవినీతి ఆరోపణలు రావడంతో డీఎల్‌పీఓ రవికుమార్ శుక్రవారం విచారణ చేపట్టారు. ఫిర్యాదు చేసిన ఎంపీటీసీ సభ్యులతోపాటు సిబ్బందిని విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. దీనిపై నివేదిక సిద్ధం చేసి జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి అందించనున్నట్లు డీఎల్‌పీఓ తెలిపారు.

జగనన్న ఆదేశం పాటించేందుకు వెళ్తున్నా

- నన్ను దీవించినట్లే మోహిత్‌ను ఆశీర్వదించండి
- నియోజకవర్గ ప్రజలకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి వినతి

తిరుపతి రూరల్ : ''2024 ఎన్నికల ప్రణాళిక, నిర్వాహణ, వైఎస్సార్‌సీపీకి చెందిన 23 అనుబంధ సంఘాల రాష్ట్ర ఇన్‌చార్జిగా గ్రామస్థాయి నుంచి వాటిని పటిష్టం చేయడం, పార్టీ వ్యవహారాల్లో వెన్నంటి ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ఆదేశించారు. వైఎస్ కుటుంబంతో మూడు తరాలుగా ఉన్న అనుబంధంతో ఆయన అప్పగించిన ఆదేశాలను శిరసావహిస్తూ వెళ్తున్నా.. అంతేకాక, ప్రాణంగా ప్రేమించే చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు సేవచేసే అవకాశం నా బిడ్డ మోహిత్‌రెడ్డికి జగనన్న కల్పించారు. నన్ను ఆశీర్వదించినట్లే మోహిత్‌రెడ్డిని కూడా ఆశీర్వదించండి''.. అని చంద్రగిరి ఎమ్మెల్యే, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం పాకాల, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లో ఏర్పాటుచేసిన సభల్లో చెవిరెడ్డి మాట్లాడారు. తనను సొంత బిడ్డలా ఆశీర్వదించిన చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు తన కుటుంబం ఎప్పుడూ రుణపడి ఉంటుందన్నారు. కన్నతల్లి లాంటి నియోజకవర్గం ప్రజలకు సేవ చేసేందుకు తన బిడ్డను కూడా ఆశీర్వదించాలని ఆయన కోరారు. తనకు ఒక కన్ను కుటుంబమైతే.. మరో కన్ను నియోజకవర్గ ప్రజలని చెప్పారు. అందుకే తమ కుటుంబం సంపాదించిన ప్రతి రూపాయిలో 75శాతం నియోజకవర్గ ప్రజలకే ఖర్చుచేస్తున్నట్లు చెప్పారు. కుటుంబానికి ఎంత ప్రాధాన్యత ఇస్తామో, అంతకంటే ఎక్కువ ప్రాధ్యాన్యత నియోజకవర్గ అభివృద్ధికి.. ఆదరించి, ఆశీర్వదించిన ప్రజల సంక్షేమం కోసం ఇవ్వాలని మోహిత్‌రెడ్డికి సూచించినట్లు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చెప్పారు. అదేవిధంగా ముఖ్యమంత్రి వెన్నంటి ఉండడం వల్ల నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు సాధించి, ఇద్దరం కలసి మనసా.. వాచా.. కర్మణా.. అభివృద్ధిలో అందరికీ ఆదర్శంగా మన చంద్రగిరి నియోజకవర్గాన్ని తయారుచేస్తామని పేర్కొన్నారు.



పాకాల సభలో మోహిత్‌రెడ్డిని పరిచయం చేస్తున్న చెవిరెడ్డి

రామకుప్పం : మహిళలకు మెగా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ భరత్



పలమనేరులో లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



ఆనందోత్సాహాల ఆసరా



పూతలపట్టులో లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

అక్కచెల్లెమ్మలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూతనందిస్తోంది. ఈ క్రమంలో వైఎస్సార్ ఆసరా పథకం కింద మూడో విడత నగదు పంపిణీకి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా శుక్రవారం జిల్లాలోని ప్రజాప్రతినిధుల చేతులమీదుగా డ్వాక్రా మహిళలకు మెగా చెక్కులు అందజేసింది. ఈ మేరకు రామకుప్పంలో ఎమ్మెల్సీ భరత్, పలమనేరులో ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పూతలపట్టులో ఎంఎస్ బాబు, చిత్తూరులో ఆరణి శ్రీనివాసులు లబ్ధిదారులకు చెక్కులు అందించారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థిక సాధికారత సాధించాలని సూచించారు. - సాక్షి, చిత్తూరు డెస్క్



చిత్తూరులో డ్వాక్రా మహిళలకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.56,300
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,600
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.72,000
రిటైల్ వెండి గ్రాము	రూ.74



	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	37	24
తిరుపతి	36	25
తిరుమల	31	19
గూడూరు	38	27
నగరి	37	26

తల్లీకూతురుపై దూసుకెళ్లిన కంటైనర్

గంగవరం : పలమనేరు–మదనపల్లె హైవేపై శుక్రవారం జరిగిన ప్రమాదంలో తల్లీకుమార్తె మృతి చెందారు. వివరాలు.. స్థానిక ఎంబీటీ రోడ్డులో నివసిస్తున్న వనిత(30) కొన్నేళ్ల క్రితం తన భర్త కిరణ్‌తో విడిపోయింది. అప్పటి నుంచి కుమార్తె చారునేత్ర(10)తో కలిసి పుట్టింట్లోనే ఉంటోంది. ఇటీవల ఆమె తల్లి దండ్రులు కూడా మరణించారు. దీంతో ఆమె తన తండ్రి నడుపుతున్న ఫ్లైఉడ్ తోపుడు మిషన్, ఇతర వ్యాపారాలను చూసుకుంటోంది. చారునేత్ర స్థానికంగా ఓ స్కూల్‌లో 4వ తరగతి చదువుతోంది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం మండలంలోని చీళ్లవారిపల్లెలో తమ బంధువుల ఇంటికి కూతురుతో కలిసి స్కూటీపై వెళ్లింది. తిరుగుప్రయాణంలో ఉండగా గంగవరం ఫ్లైఓవర్ వద్ద పక్కనే వస్తున్న కంటైనర్ హఠాత్తుగా వీరు ప్రయాణిస్తున్న స్కూటీ మీదకు ఎక్కేసింది. దీంతో లారీ వెనుక చక్రాల కింద తల్లీకూతురు పడిపోయారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. కొన ఊపిరితో




మృతి చెందిన వనిత, చారునేత్ర



వనిత, చారునేత్ర (ఫైల్)

కొట్టుమిట్టాడుతున్న వనిత, చారునేత్రను హుటాహుటిన పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే తల్లి మరణించగా, చికిత్సపొందుతూ కుమార్తె కూడా కన్నుమూసింది. కంటైనర్ డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో రైతు ఆత్మహత్య



రమేష్‌రెడ్డి (ఫైల్)

బైరెడ్డిపల్లె : మండలంలోని అల్లపల్లె పంచాయతీ మూగనపల్లెలో మనస్తాపం చెందిన ఓ రైతు శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. రమేష్‌రెడ్డి (35) అనే రైతు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గత ఏడాది తన కుమార్తె నయనిక (2.5) క్యాన్సర్ బారిన పడింది. చిన్నారి చికిత్స నిమిత్తం రమేష్‌రెడ్డి బైరెడ్డిపల్లె సప్తగిరి గ్రామీణ బ్యాంకులో తన భూమిని తనఖా పెట్టి రూ.5.5లక్షలు, ఇంటిపై రూ.10లక్షల రుణం తీసుకున్నాడు. కుమార్తెను బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించాడు. అయినప్పటికీ క్యాన్సర్ నయం కాలేదు. ఇటు అప్పులు తీర్చలేక, అటు బిడ్డకు వ్యాధి తగ్గక మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో గ్రామ సమీపంలోని ఓ చెట్టుకు ఉరివేసుకుని మరణించాడు. భార్య సావిత్రమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రోడ్డుప్రమాదంలో మహిళలకు గాయాలు




బోల్తాపడిన వాహనం, మాట్లాడుతున్న జేసీ వెంకటేశ్వర్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: మండలంలోని ఉన్సిగానిపల్లెకు చెందిన 30 మంది మహిళా గ్రూపు సభ్యులు ఓ వాహనంలో శుక్రవారం రామకుప్పంలో నిర్వహిస్తున్న వైఎస్సార్ ఆసరా నగదు పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరారు. మార్గం మధ్యలో గంగమ్మ చెరువు వద్ద వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు మురళీకృష్ణ హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను తమ వాహనాల్లో కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. సకాలంలో స్పందించిన నేతలకు క్షతగాత్రుల కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

క్షతగాత్రులను ఆదుకుంటాం

కుప్పం : వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తూ ప్రమాదానికి గురైన క్షతగాత్రులను ఆదుకుంటామని జేసీ వెంకటేశ్వర్ తెలిపారు. కుప్పం పీఈఓస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్‌తో కలిసి ఆయన పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ.2లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.25వేల ఆర్థికసాయం అందించనున్నట్లు వెల్లడించారు.

వరకట్నం వేధింపులపై ఫిర్యాదు



కుమారుడితో బాధితురాలు

రొంపిచెర్ల: వరకట్నం తీసుకురావాలని భర్త, అత్త రోజూ వేధిస్తున్నారని ఓ వివాహిత శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు.. మండలంలోని బొమ్మయ్యగారిపపల్లె వినాయక్ నగర్‌కు చెందిన ఎం.బోదేషా (24) జాండ్లవారిపల్లెకు బావాజీ కుమార్తె ఖుషహాన్ (22)ను 2018లో వివాహం చేసుకున్నాడు. అప్పుడు 85 గ్రాముల బంగారం ఇచ్చారు. వీరికి కుమారుడు రెడ్డిహర్షద్(4) ఉన్నాడు. అనంతరం బోదేషా మద్యం, జూదానికి బానిసగా మారాడు. దీంతో ఇల్లు గడవడం కూడా కష్టంగా మారింది. నగలు సైతం అమ్మేశాడు. ఖుషనాస్ తల్లిదండ్రుల నుంచి మరో రూ.లక్ష వరకు తీసుకున్నాడు. అదీ అయిపోవడంతో అదనంగా కట్నం తేవాలని, లేకుండే మరో పెళ్లి చేసుకుంటానని బెదింపులకు దిగాడు. భర్తకు అత్త షాహీనా కూడా తోడై ఖుషనాస్‌ను మరింతగా వేధించడం మొదలు పెట్టారు. ఈ క్రమంలో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. తనకు కుమారుడికి రక్షణ కల్పించి, న్యాయం చేయాలని పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గృహహింస కేసులో ముగ్గురికి జైలు



ముద్దాయిలను జైలుకు తరలిస్తున్న పోలీసులు

నగరి : నింద్ర మండలం నెట్టేరి గ్రామానికి చెందిన ఎస్.గీత తనను భర్త, అత్తమామలు ఎస్ ఎస్ శ్రీహరి, ఎస్.అంకమ్మండడి అనే సుబ్రమణ్యం మండడి, ఎస్.అలిమేలులు గృహహింసకు గురి చేస్తున్నారంటూ 2017లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. శుక్రవారం కేసు నగరి జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో విచారణకు వచ్చింది. ఏపీపీ రామకాంతి వాదనలు విన్న జడ్జి విష్ణువర్మ ముద్దాయిలకు రెండేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.26వేల జరిమానా విధించారు.

రెండోపెళ్లి కేసులో ఇద్దరికి..

నింద్ర మండలం కొప్పేడు దళితవాడకు చెందిన వి.యశోద తన భర్త రెండో పెళ్లి చేసుకున్నాడని 2018లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. భర్త, మామపై చర్యలు తీసుకోవాలని పేర్కొంది. శుక్రవారం ఈ కేసు నగరి జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో విచారణకు వచ్చింది. ఏపీపీ రామకాంతి వాదనలు విన్న న్యాయమూర్తి విష్ణువర్మ ముద్దాయిలు తిరుపాల్, వైరం ఇద్దరికీ ఏడాది జైలు శిక్ష, రూ.2వేలు చొప్పున జరిమానా విధించారు.

రక్షణ కల్పించండి

చిల్లకూరు: ప్రేమ జంటకు రక్షణ కల్పించాలని చిల్లకూరు పోలీసులకు దిశ ఫౌండేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ నిడిగుంట అరుణ సూచించారు. ఆమె వివరాలకు చిల్లకూరులోని మిక్సెడ్ కాలనీకి చెందిన మనోజ్ ప్రవేటు ఉద్యోగం చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో అతనికి అన్నమయ్య జిల్లా, పీలేరుకు చెందిన యువతితో ఇన్‌స్టాగామ్‌లో పరిచయం ఏర్పడింది. ఆన్‌లైన్ ద్వారానే వివరాలు తెలుసుకుని ఒకరికొకరు ఇష్టపడ్డారు. ఆ తర్వాత వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నారు. అయితే ఇద్దరి కులాలు వేరు కావడంతో వారి తల్లిదండ్రులు పెళ్లికి అంగీకరించలేదు. దీంతో వారు నెల్లూరులోని దిశ ఫౌండేషన్ చైర్‌పర్సన్‌ను ఆశ్రయించారు. ఇరువురూ మేజర్లు కావడంతో నెల్లూరులోని వేణుగోపాల్ స్వామి సన్నిధిలో వివాహం జరిపించి నేరుగా చిల్లకూరు ఎస్‌ఐ గోపాల్‌కు అప్పగించారు. రెండు కుటుంబాల పెద్దల నుంచి వారికి రక్షణ కల్పించాలని కోరారు.

సైబర్ నేరగాడి అరెస్టు



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కుప్పం : పశ్చిమబంగాకు చెందిన నాసిం షేక్ అనే సైబర్ నేరగాడిని అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ రియాజ్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నిందితుడు ఆన్‌లైన్ ద్వారా వస్తువులు పంపుతామని గుడుపల్లె మండలం సోన్నార్లనపల్లెకు చెందిన సులోచనను మోసం చేసి రూ.1.50లక్షలు కాజేసినట్లు వెల్లడించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ప్రత్యేక నిఘా బృందం దర్యాప్తు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రామాంజనేయులు పాల్గొన్నారు.

దుర్భాషలాడిన పోలీసుల బదిలీ

గంగాధరనెల్లూరు : విశ్రాంత పీఆర్‌ఓ , వైఎస్సార్‌సీపీ నేత రవీంద్రనాథ్‌రెడ్డిని దుర్భాషలాడిన ఇద్దరు పోలీసులపై బదిలీ వేటు పడింది. గురువారం రాత్రి పోలీస్‌స్టేషన్ ఎదుట స్థానికులు ధర్నా చేస్తుండగా అక్కడే ఉన్న రవీంద్రనాథ్ రెడ్డిని ఏఎస్‌ఐ గజేంద్ర, కానిస్టేబుల్ వినోద్‌కుమార్ దూషించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు డీఎస్పీ శ్రీనివాసమూర్తి విచారణ చేపట్టారు. ఈ మేరకు ఇద్దరు పోలీసులను పెనుమూరుకు బదిలీ చేస్తున్నట్లు వెల్లడించారు.

కారును ఢీకొన్న బస్సు



బోల్తాపడిన వాహనం

బంగారుపాళెం: మండలంలోని తంబుగానిపల్లె వద్ద శుక్రవారం చెన్నై– బెంగళూరు జాతీయ రహదారిపై ముందుకు వెళుతున్న బొలెరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో బొలెరో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని మహిళ మృతి

గుడుపల్లె : మండలంలోని మిట్టూరు వద్ద శ్రీరామ నవమి ఉత్సవాలకు వెళ్లి ఇంటికి వస్తున్న వృద్ధురాలిని బైక్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గురువారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో మరో మహిళ తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్సపొందుతోంది. వివరాలు. చీకటిపల్లెకు చెందిన అమ్మయ్య(70), ఎల్లమ్మ నవమి ఉత్సవాలకు వెళ్లారు. రాత్రి తిరిగి వస్తుండగా ఎదురుగా అతివేగంతో వచ్చిన ఓ బైక్ ఢీకొట్టింది. అమ్మయ్య మరణించగా, ఎల్లమ్మ పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహ రిసెప్షన్‌కు వెళ్లివస్తూ తిరిగిరాని లోకాలకు

- ఆటోను ఢీకొన్న గుర్తుతెలియని వాహనం
- ఇద్దరు అక్కడికక్కడే మృతి
- మరో ఐదుగిరికి తీవ్ర గాయాలు




ప్రమాదంలో మృతి చెందిన ఇమ్రాన్, దినేష్ (ఫైల్)




ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు

చంద్రగిరి: వివాహ వేడుకలకు హాజరై తిరిగి వస్తున్న క్రమంలో గుర్తుతెలియని వాహనం షేర్ ఆటోను ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందగా, మరో ఐదుగురు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి తూర్పుపల్లి సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... సదుంకు చెందిన అమర్‌నాథ్ కరకంబాడి సమీపంలోని ఓ ప్రయివేటు ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. అతనికి వివాహం నిశ్చయం కావడంతో గురువారం రాత్రి రిసెప్షన్‌కు హాజరయ్యేందుకు తన స్నేహితుడు శ్రీనివాసులు షేర్ ఆటోను తీసుకుని, ఫ్యాక్టరీలో పనిచేసే తోటి స్నేహితులు ఇమ్రాన్(23), దినేష్(24), పృథ్వీ, జయచంద్రారెడ్డి, నాయుడు, విశ్వనాథ్, విజయ్‌రెడ్డితో కలిసి సదుంకు బయల్దేరారు. రిసెప్షన్ చూసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. శుక్రవారం తెల్లవారుజామున పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి తూర్పుపల్లి వద్ద రహదారి పనులు పూర్తి కాకపోవడంతో ఎటువెళ్లాలో తెలియక రాంగ్‌రూట్‌లో చంద్రగిరి వైపు వస్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం షేర్ ఆటోను ఢీకొనడంతో ఇమ్రాన్, దినేష్ అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ప్రయాణిస్తున్న విశ్వనాథ్ మాత్రం క్షేమంగా బయటపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని 108 వాహనంలో క్షతగాత్రులను తిరుపతి రుయాకు తరలించారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి వారి బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అధికారుల అలసత్వంతోనే రోడ్డు ప్రమాదాలు

పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి విస్తరణ పనులను అధికారులు దాదాపు 90శాతం పూర్తి చేశారు. పనపాకం వద్ద స్థానికులు నష్టపరిహారం విషయంలో న్యాయం జరగకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. దీంతో పనులు తాత్కాలికంగా ఆగిపోయాయి. బెంగళూరు వైపు నుంచి తిరుపతి వెళ్లే మార్గంలో పనపాకం నుంచి తూర్పుపల్లి వరకు రోడ్డు పనులు జరగలేదు. విషయం తెలియని ప్రయాణికులు వేగంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో కూడా ఇదే ప్రాంతంలో రోడ్డు ప్రమాదలో చోటు చేసుకుని మృత్యువాత పడ్డారు. పనులు ఆగిపోయిన ప్రాంతంలో సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. టోల్‌గేట్‌తో రుసుములు వసూలు చేసుకుంటున్నారే తప్ప సురక్షిత ప్రయాణానికి కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.